జేఈఈ మెయిన్స్‌లో
ప్రైవేట్ కళాశాలల సత్తా

ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్స్‌కి సంబంధించి గురువారం విడుదలైన ఫలితాల్లో తమ కళాశాలలు అధిక పర్సంటైల్స్‌తో సత్తా చాటినట్లు ఖమ్మం లోని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రకటించాయి. తమ కళాశాలల విద్యార్థులు జాతీయస్థాయి ర్యాంకులతో ప్రతిభ చాటినట్లు వాటి యాజమన్య బాధ్యులు వివరించారు.

శ్రీచైతన్య అగ్రగామి..

ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో శ్రీచైతన్య చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య

తమ కళాశాల విద్యార్థులు ప్రతిష్టాత్మక జేఈఈ మెయిన్స్‌లో ఆలిండియా ర్యాంక్‌లు సాధించి అగ్రగామిగా నిలిచారని శ్రీచైతన్య కళాశాల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. ఓపెన్ కేటగిరీలో తమ విద్యార్థులు శ్రీసాత్విక్-364, నవదీప్ కిరణ్-967, సాత్విక్-969, శ్రీరామ్‌తేజ-1161, అభిలాష్-1688, సంజయ్-1955వ ర్యాంక్‌లతో రాణించిట్లు వివరించారు. వీరితోపాటు 99కిపైగా పర్సంటైల్‌తో 19 మంది ప్రతిభ చూపారన్నారు. ఆలిండియా స్థాయిలో 100లోపు నాలుగు ర్యాంక్‌లు, 500లోపు 24 ర్యాంక్‌లు, వెయ్యిలోపు 37 ర్యాంక్‌లు, 2వేల లోపు 74 ర్యాంక్‌లు వచ్చినట్లు వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ సాయిగీతిక, డీజీఎం చేతన్ మాధుర్, డీన్ వర్మ, ఏజీఎంలు చిట్టూరి బ్రహ్మం, ప్రకాష్, గోపాలకృష్ణ, ప్రిన్సిపాళ్లు అభినందించారు.

న్యూవిజన్‌దే ప్రభంజనం

జేఈఈలో సత్తా చాటిన విద్యార్థులతో న్యూవిజన్ చైర్మన్ ప్రసాద్

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ విద్యార్థుల్థు మరోసారి జయకేతనం ఎగురవేసినట్లు న్యూవిజన్ విద్యా సంస్థల అధినేత చుంచు గోపాలకృష్ణ ప్రసాద్ తెలిపారు. ఓపెన్ కేటగిరీలో తమ విద్యార్థి వర్షిత్ కొప్పుల-395, మహాశ్వి-732, శ్రీరామ్-1039, రుషిందర్‌రెడ్డి-1128, ప్రభంజన్ జాదవ్ -2182, మురళీ కృష్ణ-2717వ ర్యాంకులతో సత్తా చాటినట్లు వివరించారు. ఖమ్మంలో ఏ కళాశాల కూడా సాధించని విజయాన్ని తమ విద్యార్థులు సాధించారని, 99పైగా పర్సంటైల్‌తో 22 మంది ప్రతిభ చూపారని వెల్లడించారు. మ్యాథ్స్, ఫిజిక్స్‌లో నూరుశాతం పర్సంటైల్‌తో సత్తా చాటిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ కార్తీక్, డైరెక్టర్ గోపీచంద్, ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, శ్రీనివాసరావు అభినందించారు.

హార్వెస్ట్ విజయదుందుభి

జేఈఈలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో హార్వెస్ట్ కరస్పాండెంట్ రవిమారుత్

తమ విద్యార్థుల్లో 95 మంది కిపైగా జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటి అడ్వాన్స్‌డ్‌కి అర్హత సాధించారని హార్వెస్ట్ విద్యాసంస్థల అధినేత పోపూరి రవిమారుత్ తెలిపారు. కేటగిరీలో ర్యాంకుల్లో తమ విద్యార్థి జస్వంత్ జాతీయస్థాయిలో 19వ ర్యాంక్ సాధించాడన్నారు. జనరల్ విభాగంలో జెఫ్నేష్ కృష్ణ ప్రసాద్-2251, రాజ్‌వర్ధన్-2666, అనీష్-3561, అభినవ్-6150, ప్రణయ్ సంజన్-7668, సాయిసృజయ్-12857, కౌషిక్-13390వ ర్యాంక్‌లు సాధించినట్లు వివరించారు. 90 శాతానికి పైగా పర్సంటైల్‌ను 48 మంది విద్యార్థులు సాధించారన్నారు. క్రమ శిక్షణాయుత ప్రణాళికతో, నిరంతరం పర్యవేక్షణతో, విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఎప్పటికప్పుడు తగిన సూచనలు అందిస్తూ విజయం సాధించామని అన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.పార్వతిరెడ్డి అభినందించారు.

రెజొనెన్స్ హవా

ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులతో రెజొనెన్స్ డైరెక్టర్లు నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావు

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి అత్యుత్తమ ర్యాంక్‌లు సాధించారని రెజొనెన్స్ కళాశాల డైరెక్టర్లు రాజా వాసిరెడ్డి నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావు తెలిపారు. తమ విద్యార్థులు శ్రీకాంత్-7వ ర్యాంక్, ఆసిఫ్-442, భరత్-540, వంశీ-719, జీవన్‌కుమార్-1116, త్రిషాంక్-1162, కిరణ్‌కుమార్‌రెడ్డి-1880, రిషిక్-2608, జగదీష్-2830, రాజ్‌కుమార్-2901, రాకేష్ సుశాంత్-3004, అరుణ్‌కుమార్-3061, వీరవర్ధన్-6555, వినాయక్-6805వ వర్యాంకు సాధించారని, మరో 100 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారని వివరించారు. ఐఐటీ, నీట్, ఎప్‌సెట్ వంటి పోటీ పరీక్షల్లో ఘన విజయం సాధించేలా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాళ్లు సతీష్, భాస్కర్‌రెడ్డి అభినందించారు.

కృష్ణవేణి విజయ భేరి

ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో కృష్ణవేణి చైర్మన్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు

జాతీయస్థాయి జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైళ్లను కైవసం చేసుకున్నట్లు కృష్ణవేణి కళాశాల అధినేత యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. తమ విద్యార్థుల్లో జశ్వంత్-66, సోనియా-73, ప్రభాస్-83, స్నేహ-199, మాధవరావు-466, సాయికిరణ్-947, నితిన్-1083, రామ్‌చరణ్‌తేజ్-1357, నితిన్-1922, సంతోష్-2136, నవదీప్-2196, సంతోష్-2355, మోహిత్-3119, ఉజ్వలామానస-3899, హారిత-3982, త్రివేణి-4243వ ర్యాంక్‌లు సాధించినట్లు వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాంచందర్‌రావు, ఇన్‌చార్జి వంశీ, ఏవో నిరంజన్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

రైతుల తరఫున పోరాడుతా..

పాలేరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు. పక్కన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

- అందరి సమస్యలకు వారధిగా నిలిచేందుకు నన్ను గెలిపించాలి
- ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్
- బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు
- పాలేరులో జరిగిన బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి, ఏప్రిల్ 25 : రైతుల సమస్యలు పూర్తిగా తెలిసిన వ్యక్తిగా, రైతుబిడ్డగా మీ ముందుకొచ్చానని, పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రతి సమస్యను పరిష్కరిస్తానని, మీ తరఫున పార్లమెంట్‌లో పోరాటం చేస్తానని బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. కూసుమంచి మండలం పాలేరులో గురువారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పోయిన శాసనసభ ఎన్నికల్లో జిల్లాలో అసెంబ్లీ స్థానాలు గెలవకపోయినా నాకు మంచి మెజార్టీ ఇచ్చారని, అదే స్ఫూర్తితో ఈసారి ఎన్నికల్లో మీ అందరి సమస్యలకు వారధిగా నిలిచేందుకు తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ నాయకులు ఓట్లు వేయించుకున్నారని, ఇప్పుడు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు ఉంటేనే రాష్ట్ర సమస్యలతోపాటు రైతుల సమస్యలపై మాట్లాడే అవకాశం దొరుకుతుందన్నారు. కొత్తగా వచ్చే వారికి ఎన్నికల్లో అవకాశం ఇవ్వడం వల్ల ఎలాంటి లాభం ఉండదని, మరో 15 రోజులు కష్టపడి పనిచేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా తనను గెలిపించాలని నామా కోరారు.

మోసం చేయడమే కాంగ్రెస్ పని : ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

కాంగ్రెస్ నాయకులు అసెంబ్లీ ఎన్నికల్లో అలవికాని హామీలు ఇచ్చి గద్దెనెక్కారని, ఇప్పుడు ప్రజలను మోసం చేయడమే పనిగా పెట్టుకున్నారని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్లలో జరిగిన అభివృద్ధి గతంలో ఎప్పుడూ జరగలేదని, ఈసారి 10 నుంచి 12 సీట్లు బీఆర్ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం ఎంపీగా నామా నాగేశ్వరరావుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

కేసులకు బెదిరేది లేదు.. : బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు

బీఆర్ఎస్ నాయకులపై ప్రాంతాల్లో కేసులు పెడుతున్నారని, అయినా బెదిరేది లేదని, వారికి పార్టీ అండగా ఉంటుందని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. కాంగ్రెస్ నాయకుల మాటలు విని బీఆర్ఎస్ వారిపై కేసులు పెట్టడం సరికాదని, చట్టప్రకారం అధికారులు పనులు చేయాలే తప్ప కొందరికి తొత్తులుగా మారొద్దన్నారు. నామా గెలుపు కోసం అంతా కలిసికట్టుగా పని చేయాలని కోరారు.

'నామా'ను గెలిపించుకోవాలి : మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

గత అసెంబ్లీ ఎన్నికల్లోని పొరపాట్లను సమీక్షించుకొని ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అంతా బాగా పనిచేసి నామాను గెలిపించుకోవాలని మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. పాలేరు ప్రజలతో మమేకమై.. వారి కష్టసుఖాల్లో ఒకడిగా ఉన్నా.. సరైన విధంగా ఓటర్ల వద్దకు చేరలేకపోయానన్నారు. పాలేరులో నామాకు మంచి మెజార్టీ వచ్చే విధంగా పని చేయాలని ఆయన కోరారు. ఇంకా ఎంపీపీ బానోత్ శ్రీనివాస్, నాయకులు ఇంటూరి శేఖర్, వేముల వీరయ్య, బజ్జూరి రాంరెడ్డి తదితరులు ప్రసంగించారు. సమావేశంలో పార్టీ నాయకులు, రూరల్, నేలకొండపల్లి పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణు, ఉన్నం బ్రహ్మయ్య, పరశురాం, ఆసీఫ్ పాషా, బాలకృష్ణ, రంజాన్, రామచంద్రునాయక్, సైదులు, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

గడిచిన పదేళ్లలో బీజేపీ చేసిందేమీలేదు

పాత్రికేయుల సమావేశంలో మంత్రులు తుమ్మల, పొంగులేటి

మతోన్మాద శక్తులకు బుద్ధి చెప్పేందుకే కాంగ్రెస్‌తో పొత్తు: సీపీఐ, సీపీఎం

ఖమ్మానికి నేను కొత్త వాడిని కాదు: కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి

పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన మంత్రి తుమ్మల

ఖమ్మం, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం.. గడిచిన పదేళ్లలో దేశ ప్రజలకు చేసిందేమీలేదని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధిస్తుందని అన్నారు. ఖమ్మం పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థిగా రామసహాయం రఘురాంరెడ్డి గురువారం నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన తరువాత ఖమ్మం ఆర్‌వో కార్యాలయ మీడియా పాయింట్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ముందుగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. జిల్లాలోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులందరి అభిప్రాయం మేరకు ఖమ్మం అభ్యర్థి ఎంపిక జరిగిందన్నారు. సోనియాగాంధీ దూతగా వచ్చిన రఘురాంరెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అనంతరం మరో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహా అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేల అభిప్రాయంతోనే చివరి రోజున రఘురాంరెడ్డికి తమ పార్టీ టికెట్ ప్రకటించిందని అన్నారు. ఖమ్మం పార్లమెంటు ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్న తరువాత ఈ నియోజకవర్గ పక్షాన అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని అన్నారు. రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి మాట్లాడుతూ.. తమ పార్టీ అభ్యర్థికి ఈ జిల్లాతో ఎంతో అనుబంధం ఉందని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. మతోన్మాద శక్తులకు బుద్ధి చెప్పేందుకే కాంగ్రెస్‌తో తమ పార్టీలు పొత్తు పెట్టుకున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. ఖమ్మానికి తాను కొత్తవాడిని కాదని అన్నారు. కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాందాస్‌నాయక్, జారే ఆదినారాయణ, మట్టా రాగమయి, పిడమర్తి రవి, జావేద్, సోమ చంద్రశేఖర్, సీపీఎం, సీపీఐ నేతలు నున్నా నాగేశ్వరరావు, బాగం హేమంతరావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఎంతో అవసరం : సీపీ సునీల్‌దత్

మామిళ్లగూడెం, ఏప్రిల్ 25: చట్టాలను అమలు చేయడం, శాంతి సామరస్యాలను కాపాడడం, నేర కార్యకలాపాలను కట్టడి చేయడం వంటి కీలకమైన బాధ్యతలు నిర్వహించాల్సిన పోలీసు విధుల్లో చట్టాలు, నిబంధనలపై పూర్తి అవగాహన ఎంతో అవసరమని సీపీ సునీల్‌దత్ పేర్కొన్నారు. అలాగే ఎంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. తొమ్మిది నెలల పోలీస్ శిక్షణలో భాగంగా సిటీ పోలీస్ శిక్షణ కేంద్రంలో రెండు నెలల శిక్షణ పూర్తి చేసుకొని ముందుకు వెళ్తున్న సివిల్ స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల (ఎస్‌సీటీపీసీ) శిక్షణ కార్యక్రమంలో భాగంగా మౌలిక సదుపాయాలు, బందోబస్తు విధివిధానాలు, శిక్షణ అంశాలపై పోలీస్ కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన ఇంట రాక్షన్ మీట్‌లో సీపీ మాట్లాడారు. ఇప్పటికే మూడు నెలల శిక్షణలో ఇన్‌డోర్, అవుట్ డోర్ శిక్షణలో మంచి తర్ఫీదు పొందుతున్నారని అన్నారు. అదేవిధంగా లోక్‌సభ ఎన్నికల్లో బందోబస్తు విధులు నిర్వహించేందుకు సిద్ధమవుతున్న ట్రైనీ కానిస్టేబుళ్లకు ఎన్నికల విధులు, విధివిధానాలపై అవగాహన ఉండాలని సూచించారు. ఏడీసీపీలు గణేష్, విజయబాబు, ఏఆర్ ఏసీపీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

కాంగ్రెస్‌ను ఓడిస్తేనే భవిష్యత్

- ఆగస్టు 15 నాటికి రాజకీయ సునామీ
- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

ఏటూరునాగారం, ఏప్రిల్ 25 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే తెలంగాణకు భవిష్యత్ ఉంటుందని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం గందరగోళంలో ఉన్నదని, ఆగస్టు 15 నాటికి రాజకీయ సునామీ ఏర్పడుతుందన్నారు. అలవిగాని 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని, ప్రభుత్వంపై భారం లేని హామీలను అమలు చేస్తున్నారని, బస్సుల్లో ఉచిత ప్రయాణం, అరువు పెట్టే ఆరోగ్యశ్రీ, వంట గ్యాస్‌కు డబ్బులు ఇవ్వని పథకాలు అమలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మీకు దమ్ముంటే మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వాలని, రూ.2 లక్షల రుణమాఫీపై ఇచ్చిన హామీ ఎప్పుడు నెరవేరుస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలుపై రూ.500 బోనస్ ఇవ్వడం లేదని, రైతుబంధు పెంచకపోగా.. ఉన్నదాన్ని చతికిలపడేలా చేశారని ధ్వజమెత్తారు. మేడిగడ్డ, శ్వేతపత్రం పేరుతో డ్రామాలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో 4 లక్షల మందికి పోడు పట్టాలు ఇచ్చి.. రైతుబంధు కూడా ఇచ్చిన ఘనత గత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కేసీఆర్ కుటుంబంపై వ్యక్తిగత కక్ష పెట్టుకుని టార్గెట్ చేస్తున్నారంటూ రేవంత్‌రెడ్డి తీరును దుయ్యబట్టారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీలు ఎందుకు రావడం లేదంటూ ఆయన ప్రశ్నించారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, ఎంపీపీ అంతటి విజయ, పార్టీ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, నాయకులు తుమ్మ మల్లారెడ్డి, కూనూరు మహేశ్, కుమ్మరి చంద్రబాబు, మాదిరి రామయ్య, బట్టు రమేశ్, కొండాయి చిన్ని, వావిలాల రాంబాబు, ఆలం సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

- చివరి రోజు 19 మంది నామినేషన్లు దాఖలు
- నేడు పరిశీలించనున్న ఎన్నికల అధికారులు
- అర్హులైన అభ్యర్థుల జాబితా ప్రకటన

నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి

మామిళ్లగూడెం, ఏప్రిల్ 25 : లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారంతో ముగిసింది. నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో అభ్యర్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి నామినేషన్లు వేశారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈనెల 18 నుంచి ప్రారంభం కాగా.. గురువారం చివరి రోజు నాటికి దాఖలు చేసిన అభ్యర్థుల పత్రాలను ఎన్నికల అధికారులు శుక్రవారం పరిశీలించి పోటీకి అర్హులైన అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. చివరి రోజు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా నామా నాగేశ్వరరావుకు చెందిన ఒక సెట్ నామినేషన్ పత్రాలను బీఆర్ఎస్ లీగల్ సెల్ నాయకులు బిచ్చాల తిరుమలరావు, దిలీప్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రామసహాయం రఘురాంరెడ్డి రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు తరపున ఆయన అనుచరులు స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థిగా ముత్యం అర్జున్‌రాజు, యువతరం పార్టీ అభ్యర్థిగా గుజ్జుల వేణుగోపాల్‌రెడ్డి ఒక సెట్ నామినేషన్ వేశారు. జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా బట్టు శ్రీనివాస్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా మల్లంపాటి సూర్యనారాయణ, ఉల్లెంగుల యాదయ్య, వడితియా వినోద, ఖలీల్ పాషా, మహ్మద్ రసూల్, మారం వెంకట్‌రెడ్డి, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అభ్యర్థిగా చిలుకబత్తిని స్టాలిన్, స్వతంత్ర అభ్యర్థిగా రవిచంద్రహన్, గోండువాన దండకారణ్య పార్టీ అభ్యర్థిగా శెట్టుపల్లి శ్రీను ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా బండారు నాగరాజు, తంబళ్ల రవి, గంగిరెడ్డి కోటిరెడ్డి, తాండ్ర ఉపేందర్ ఒక సెట్ నామినేషన్ వేశారు. చివరి రోజు అభ్యర్థులు ఎక్కువ మంది రావడంతో సాయంత్రం 6.30 గంటల వరకు జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ వారి నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు.

45 మంది అభ్యర్థులు.. 72 సెట్ల నామినేషన్లు

ఖమ్మం, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ స్థానానికి భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు పలువురు రిజిస్టర్డ్ పార్టీల అభ్యర్థులుగా, మరి కొందరు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు అందించారు. బీఆర్ఎస్ నుంచి ప్రస్తుత ఎంపీ, లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు పోటీలో ఉన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ నుంచి రామసహాయం రఘురాంరెడ్డి నామినేషన్ దాఖలు చేసినప్పటికీ ఆపార్టీకి చెందిన రాయల నాగేశ్వరరావు, పోట్ల నాగేశ్వరరావు కూడా రెబల్ అభ్యర్థులుగా నామినేషన్లు సమర్పించారు. జాతీయ పార్టీల్లో బీజేపీ నుంచి తాండ్ర వినోద్‌రావు పోటీ చేస్తున్నారు. బీఎస్‌పీ నుంచి కొత్తగూడేనికి చెందిన న్యాయవాది ఎర్రా కామేశ్ పోటీలో ఉన్నారు. ఈసారి సీపీఎం, సీపీఐ కలిసి కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నాయి. టీడీపీ, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, న్యూడెమోక్రసీ వంటి పార్టీలు పోటీకి దూరంగా ఉన్నాయి. ఈ పార్టీల నుంచి ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు. అయితే, వారం రోజుల పాటు సాగిన నామినేషన్ల ప్రక్రియలో 45 మంది అభ్యర్థులు 72 సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు అందజేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు పోటీలో ఉండాలనుకునే వారు 1 నుంచి 4 సెట్ల వరకు నామినేషన్ పత్రాలు అందించారు. శుక్రవారం వాటిని ఎన్నికల అధికారులు పరిశీలిస్తారు. ఆ తరువాత ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా వెలువడుతుంది. మహబూబాబాద్ స్థానం నుంచి 48 మంది అభ్యర్థులు 60 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు.